ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
సోమవారం 9 డిసెంబరు 2024



సంక్షేమ సంబురం

- కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎన్నో మార్పులు
- రాజన్న క్షేత్రంలో అభివృద్ధి అడుగులు
- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఒడిదొడుకులు
- నెరవేరిన యారన్ డిపో కల
- మిడ్ మానేరు నిర్వాసితులకు చేయూత
- జిల్లాలో ప్రగతి పరుగులపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్



వేములవాడ దేవస్థానం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తయింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏడాదిలో కాంగ్రెస్ సర్కారులో ఏన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానం అభివృద్ధి వైపు అడుగులు వేసింది. వస్త్ర పరిశ్రమకు కేంద్రంగా ఉన్న సిరిసిల్లలో నేత కుటుంబాలు ఒడిదొడుకులను ఎదుర్కున్నా చివరకు ప్రభుత్వం భరోసా కల్పిస్తుందనే ఆశలు ఏర్పడ్డాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న యారన్ డిపో వస్త్రపరిశ్రమ ముంగిటకు వచ్చింది. గత ప్రభుత్వం అందించిన అర్డర్లు ఒక్కసారిగా నిలిచిపోవడంతో ఆత్మహత్యలు, ఆందోళనలు పరిశ్రమ మూతపడి ఇబ్బందికర



గృహజ్యోతి పథకాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్(ఫైల్)

పరిస్థితులను ఎదుర్కున్నారు. వస్త్ర పరిశ్రమను ఆదుకునే దిశగా వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు ప్రత్యేక దృష్టితో ఊరట లభించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం అందించిన ఆరు గ్యారంటీల ద్వారా జిల్లాకు రూ. 500 కోట్ల లబ్ధి చేకూరింది. రైతులకు రూ. 380 కోట్ల రుణమాఫీ, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు గత ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 379 కోట్ల బకాయిలు వచ్చాయి. ఏడాదిలో కాంగ్రెస్ సర్కార్ ప్రజల్లో ప్రగతి సౌరభం, సంక్షేమం సంబురాన్ని నింపుతూ జిల్లాను ముందుకు నడిపిస్తుందనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి అడుగులు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో అభివృద్ధికి అడుగులు పడ్డాయి. భక్తులకు సౌకర్యవంతంగా వేగంగా దర్శనం కల్పించే దిశగా చర్యలు చేపట్టారు. బ్రేక్ దర్శనం వంటి వాటికి చర్యలు చేపట్టారు. మూలవాగు మీదుగా రాజన్న ఆలయానికి చేరుకునే విధంగా ప్రభుత్వం రూ. 127 కోట్ల నిధులు కేటాయించి పనుల్లో వేగం పెంచారు. కోడె మొక్కులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ గోశాలల అభివృద్ధికి రూ. 66 లక్షలు కేటాయించారు.

మిగతా 8లో

న్యూస్ బాక్స్

'పట్టభద్రులకు న్యాయం చేస్తా'

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే పట్టభద్రులకు న్యాయం చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆశావహ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల గుండా భారీ ర్యాలీ నిర్వహించి స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రుల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న హరికృష్ణ మాట్లాడుతూ ఒక్కసారి అవకాశం ఇస్తే ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతానన్నారు. శాసనమండలి విద్యావంతుల, మేధావులు, వివిధ రంగాల్లో నిపుణులను ఎన్నుకోవడం ద్వారా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో వారికి భాగస్వామ్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, నాయకులు శ్రీనివాస్‌రావు, సి రామరాజు, వంశీ కృష్ణ, మల్లేష్, వినోద్, పట్టభద్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచర్ల బొప్పాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇన్‌స్పైర్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. శ్రవణ్ తేజ, ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్ (ఆర్‌బీఎస్‌పీ) విభాగంలో, సంపత్ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో జరిగిన ఇన్‌స్పైర్ విద్యావైజ్ఞానిక ప్రదర్శన ఎగ్జిబిషన్‌లో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యల వలయంలో తుర్కకాశీ కాలనీ

- డబుల్ ఇళ్లకు నోచుకోని కుటుంబాలు
- గుడిసెల్లో కాలం వెళ్లదీత

8



కాలనీలో పేరుకుపోయిన మురుగు

వేములవాడలో భక్తుల రద్దీ

- ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు

7



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

మానవత్వం చాటుకున్న ఎస్పీ



ఫిట్స్ వచ్చిన వ్యక్తికి ప్రాథమిక చికిత్స చేయిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని శివనగర్‌కు ఎదురుగా గల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో ఆదివారం ఓ వ్యక్తి ఫిట్స్ వచ్చి పడిపోయి ఉండగా అటుగా మార్నింగ్ వాక్ వెళ్లిన ఎస్పీ అఖిల్ మహాజన్ వెంటనే స్పందించి సహాయం అందించారు. అతనికి తన వ్యక్తిగత సిబ్బంది సహాయంతో ప్రాథమిక చికిత్స అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీని ప్రజలు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కళ్యాణ్ కుమార్

గంభీరావుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కళ్యాణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ కుమార్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు లేనిదే విద్యార్థులకు ఏ రకంగా బోధన అందుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారిన ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్య తీరడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడంలో ప్రభుత్వం బాధ్యత వహించడం లేదన్నారు. అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉంటేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, వెంటనే మండలంలో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

జిల్లాలో కుండపోత వర్షం



సిరిసిల్లలో కురుస్తున్న వర్షం



చందుర్తి మండలం మర్రిగడ్డలో తడిసిన పత్తి పంట

సిరిసిల్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం కుండపోతగా వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడవకుండా పరదాలు కప్పి ఉంచారు. జిల్లా కేంద్రంలో 19.3 మిల్లీమీటర్ల వర్షం కురవగా వేమువాడలో 23.0 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. మధ్యాహ్నం నుంచే మేఘాలు కమ్ముకొని వర్షం ఎడతెరిపి లేకుండా కురిసింది. సిరిసిల్లలో భారీ వర్షానికి పాత బస్టాండ్, సర్దార్‌నగర్, సంజీవయ్యనగర్, శాంతినగర్, బీవైనగర్, వెంకంపేట, గణేష్‌నగర్, తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు ప్రవహించింది.

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి: ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వర్షం కురిసింది. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు బస్తాలు నిల్వ ఉండడం రైతన్నలు ఆగమయ్యారు. బస్తాలను తడవకుండా పరదాలతో కప్పి ఉంచారు.

చందుర్తి: మూడు నాలుగు రోజులుగా వాతావరణంలో ఏర్పడిన



సిరిసిల్లలో రోడ్డుపై నిలిచిన నీరు

మార్పుతో కురుస్తున్న వర్షానికి పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. వర్షం కురువడం వల్ల చేనులో ఉన్న పత్తి నల్లబారుతున్నది. మరికొన్ని గ్రామాల్లో మోస్తరు వర్షం కురువడంతో పంట నష్టం సంభవించింది. మండలంలోని మూడపల్లి, మర్రిగడ్డ, చందుర్తి, మల్యాల, తదితర ప్రాంతాల్లో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలో వివిధ గ్రామాల్లో 6,140 ఎకరాల్లో పత్తి పంట రైతులు సాగు చేసినట్లు మండల వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షంతో పంట చేనులోనే పత్తి తడిసి ముద్దవుతోంది. కొంత మేర పత్తి నేలవారింది. ఎకరానికి 20 నుంచి 30 వేల వరకు పెట్టుబడి పెట్టామని, పెట్టుబడి కూడా వస్తుందో రాదోనని రైతులు వాపోతున్నారు. తడిసిన దూది నల్లగా తయారై ఎక్కడ పనికిరాకుండా పోతుందేమోనని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంట నష్టం అంచనా వేసి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వర్షంతో పత్తి నేలవాలింది



బొడిగె అనిల్, రైతు, మర్రిగడ్డ

ఐదెకరాల్లో పత్తి పంట సాగు చేశాను. వరుసగా నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో పత్తి పంట నేల వాలింది. పత్తి పంట కోసం లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టాను. పెట్టుబడి కూడా వస్తుందో రాదో తెలియని పరిస్థితి ఉంది.

రైతును రాజు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - రుద్రంగి మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం





ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో రుద్రంగి మార్కెట్ కమిటి నూతన పాలకవర్గం, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రుద్రంగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తెలంగాణ కో ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి హాజరయ్యారు. చైర్మన్‌గా చెలుకల తిరుపతి, వైస్ చైర్మన్‌గా బొజ్జ మల్లేశం, డైరెక్టర్లుగా మాడిశెట్టి ప్రభాకర్, అల్లూరి సంతోష్‌రెడ్డి, గోపిడి రవీందర్, అమరబండ సాయికుమార్, ఈసరి శ్రీనివాస్, గుగులోత్ గజన్‌లాల్, కరీం అబ్దుల్, బాణాల లావణ్య, మర్రి కృష్ణ, ఇందూరి మధు, ఏనుగుల లచ్చిరెడ్డి, నాగుల శంకరయ్య ప్రమాణ స్వీకారం చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తెలంగాణ కో ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతిని గజమాలతో సన్మానించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్‌రెడ్డి కలికోట సూరమ్మ చెరువును సందర్శించారన్నారు. వేములవాడ నియోజకవర్గంలో రూ 1,000 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. రుద్రంగిలో ఏటీసీ కళాశాల మంజూరు, మేడిపల్లి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేశామన్నారు.

రైతు రుణమాఫీలో భాగంగా 18 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమచేశామని తెలిపారు. నూతన పాలకవర్గం రైతులకు అందుబాటులో ఉండి మార్కెట్‌లో సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు గట్ల మీనయ్య, నాగం కుమార్, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కెసిరెడ్డి నర్సారెడ్డి, గండి నారాయణ, ఇప్ప మహేష్, కోమిరె శంకర్, పల్లి గంగాధర్, సనుగుల గంగాధర్, పిడుగు లచ్చిరెడ్డి, మాడిశెట్టి అభిలాష్, తర్రె లింగం, ఎర్రం రాజలింగం, జక్కు మోహన్, జక్కు వంశీ, దిలీప్, లక్ష్మణ్, పడాల శ్రీనివాస్, సూర యాదయ్య, స్వర్గం పరందామ్, పూదరి మహిపాల్, ఎర్రం అరవింద్, దయ్యాల శ్రీనివాస్, చెలుకల శ్రీకాంత్ పాల్గొన్నారు.

అధిక వడ్డీ పేరుతో హోటల్ వ్యాపారి టోకరా?

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని ఓ హోటల్ వ్యాపారి అధిక వడ్డీల పేరుతో బాధితుల ను మోసం చేసినట్లు సమాచారం. పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన ఓ వ్యక్తి పాతబస్టాండ్‌లో కొంతమంది భాగ స్వామ్యంతో ఓ హోటల్‌ను నెలకొల్పాడు. ఈ హోటల్ పేరిట అధికవడ్డీలకు ఆశపడే వారిని నమ్మించి ఐదు లక్షల రూపాయల నుంచి 20 లక్షల రూపాయల వరకు మూడు, ఐదు రూపాయ ల వడ్డీకి లక్షల రూపాయలు అప్పులు తీసుకున్నట్లు బాధితులు చెబుతున్నారు. అయితే ఆ హోటల్ యజమాని కొన్నిరోజులుగా సిరిసిల్లలో కనిపించక పోవడంతో ఈ విషయం బయటపడింది. ఒకరితర్వాత మరొకరు దాదాపు 50 మందికిపైగా బాధితులు బయటకు వచ్చి తనకు డబ్బులు ఇవ్వాలంటూ, అధిక వడ్డీలకు ఆశపడి మోసపోయామ ని పోలీసులను ఆశ్రయించారని తెలిసింది. ఈ విషయంపై స్పెషల్ బ్రాంచి పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

గ్రూప్-2 పరీక్షలకు నిబంధనలు పాటించాలి

- నేటి నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలు పాటిస్తూ గ్రూప్-2 అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 15, 16 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. సోమవారం నుంచి అభ్యర్థులు హాల్‌టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పరీక్షా సమయానికి అరగంట ముందే గేట్లు మూసివేయడం జరుగుతుందన్నారు. ఆ తరువాత ఎవరినీ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరని తెలిపారు. అభ్యర్థులు పూర్తిగా నిబంధనలు తెలుసుకొని పరీక్షలకు రావాలాని సూచించారు.

నేడు సెస్ కార్యాలయంలో ప్రజావాణి

కోనరావుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో విద్యుత్ సమస్యలపై సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కోనరావుపేట సెస్ ఏఈ దివ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు చేరువయ్యే విధంగా సమస్యలపై ఫిర్యాదు చేసుకునేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతీ సోమవారం 10 గంటల నుంచి 1:00 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎల్లారెడ్డిపేట (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల విద్యుత్ నియోదారులు సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం నిర్వహిస్తున్న విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సెస్ ఏఈ పృథ్వీదర్ ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమానికి సెస్ డైరెక్టర్ కృష్ణహరి, విద్యుత్‌శాఖ అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సమస్యలపై ప్రజావాణిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాజన్న ఆలయానికి ఆర్జేసీ స్థాయి అధికారిని నియమించాలి

వేములవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏటా వంద కోట్ల రూపాయల ఆదాయం ఉన్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానానికి రీజినల్ జాయింట్ కమిషనర్(ఆర్జేసీ) స్థాయి అధికారిని పూర్తిస్థాయి కార్యనిర్వహణాధికారిగా నియమించాలని వేములవాడ మాజీ సర్పంచ్ పొలాస నరేందర్ ఒక ప్రకటనలో కోరారు. రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానానికి అనేక సంవత్సరాలుగా పూర్తిస్థాయి ఈవో నియమించకుండా, కిందిస్థాయి అధికారులను తాత్కాలిక పద్ధతిన ఇన్‌చార్జి ఈవోలుగా నియమిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయి అధికారిని నియమించకపోవడంతో ఆలయంలో వసతి, పారిశుధ్య నిర్వహణ, కోడెల నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిపోయాయని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి సహాయ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులను కాకుండా రీజినల్ జాయింట్ కమిషనర్ లేదా ఆపై స్థాయి హోదా గల అధికారులను రాజన్న ఆలయ ఈవోగా నియమించాలని ఆయన కోరారు.

రాజేశ్వర్‌రావునగర్‌లో బీఆర్ఎస్ గద్దె కూల్చివేత



కూల్చివేసిన బీఆర్ఎస్ పార్టీ గద్దె

గంభీరావుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) మండలంలోని రాజేశ్వర్‌రావు నగర్‌కాలనీలో బీఆర్ఎస్ పార్టీ గద్దెను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. శనివారం అర్థరాత్రి బీఆర్ఎస్ కారు గద్దెను కూల్చివేసినట్టు బావిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో రెండేళ్ల క్రితం రాజేశ్వర్‌రావునగర్‌కాలనీ వద్ద గద్దెను నిర్మించి, కారును పెట్టారు. ఇటీవల అధికారులు అక్కడి నుంచి కారును తీసేయాలని సూచించడంతో బీఆర్ఎస్ నేతలు వారం క్రితమే కారును తీసేశారు. కారును తీసేసిన వారం రోజులకే కారు కోసం నిర్మించిన గద్దెను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కూల్చేశారు. కావాలనే కొందరు గద్దెను కూల్చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. కారు గద్దె కూల్చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కారు గద్దె కూల్చేసిన స్థలాన్ని స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ పరిశీలించారు. కాగా పలువురు బీఆర్ఎస్ నేతలు కారు గద్దె కూల్చివేసిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి మాట్లాడుతూ గద్దెను కూల్చి వేసిన స్థలంలోనే తిరిగి నిర్మిస్తామని తెలిపారు.

శక్తివంతమైన దేశంగా మార్చడమే బీజేపీ లక్ష్యం



కోమల ఆంజనేయులును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శక్తివంతమైన దేశంగా మార్చడమే బీజేపీ లక్ష్యం అని రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కోమల ఆంజనేయులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అట్టడుగువర్గాల ప్రజలకు అందుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో ఆర్థిక అసమానతలు రూపుమాపడానికి ప్రధాని కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు దక్కించుకొని సత్తాచాటాలన్నారు. అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, మాజీ మండలశాఖ అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, నాయకులు మ్యాకల మల్లేశం, ముత్తక్క, బత్తిని స్వామి, తిరుపతి, అశోక్‌యాదవ్, కమలాకర్‌రావు, సంతోష్, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

కావలెను

★ కరీంనగర్‌లో పనిచేయుటకు తెలుగు మరియు ఇంగ్లీష్ టైపింగ్ అనుభవం కలిగిన డి.టి.పి. ఆపరేటర్ కావలెను. జీతం : 15,000/- వివరాలకు సంప్రదించండి. సెల్ : 93461 27562

AJK-218263

CHANGE OF NAME

★ I, "CHETUR VEDULA VANAJA" D/O. CHETUR VEDULA VENKATAKISTAIAH, R/O. H.NO: 9-5-263/1, PRAGATHI NAGAR, RAMNAGAR, KARIMNAGAR, I, HAVE CHANGED MY NAME AS "YENREDDY NEERAJA" W/O.YENREDDY MAHESHWAR.

AJK-16262

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 9703618691, 99854 10640

జగిత్యాల :- సెల్ : 99854 11262

మెట్‌పల్లి :- సెల్ : 70131 42966

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

పెద్దపల్లి :- 95509 00238

రుణ మాఫీలో కేంద్రం బాధ్యతలను విస్మరించడం తగదు

- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు రుణ మాఫీ వ్యవహారంలో కేవలం రాష్ట్రానికే బాధ్యత ఉంటుందా.. కేంద్రానికి బాధ్యత లేదా అని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో రుణ మాఫీ వ్యవహారం లో కేంద్రమే బాధ్యత తీసుకుందని గుర్తు చేశారు. ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం రైతు రుణ మాఫీ బాధ్యతను విస్మరించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రుణ మాఫీలో కేంద్రం తనవంతు పాత్రను పోషించాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కోరుతున్నానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనలో రాచరిక వ్యవస్థకు అద్దం పట్టేలా రూపొందించారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బి డ్డను పోలి ఉండేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారని వివరించారు. తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న అనవసర విమర్శలు మానుకోవాలని సూచించారు. కాంగ్రెస్ సర్కారు అన్ని నియోజకవర్గాలలో రెసిడెన్షియల్ స్కూళ్ల లో సొంత భవనాలు కట్టించే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ బండ శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు దుర్గయ్య, నక్క జీవన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాజుల రాజేందర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రాజేశ్, నాయకులు పాల్గొన్నారు.

- సీఎంకు జీవన్‌రెడ్డి లేఖ..


తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేయనున్న 16 కృషి విజ్ఞాన కేంద్రాలలో భాగంగా జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జీవన్ రెడ్డి ఆదివారం లేఖ రాశారు. కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన యూనివర్సిటీ ఆధ్వర్యం లోని శాస్త్రవేత్తల బృందం జగిత్యాలలో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసినట్లు తెలిసిందన్నారు. జగిత్యాల పట్టణ శివారులోని చల్‌గల్‌లో గల వాలంతరీకి చెందిన భూమి సుమారు 50 ఎకరాలు అందు బాటులో ఉందని, కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నీరుకుల్ల వంతెనకు మోక్షమెప్పుడో?


నీరుకుల్లలో మానేరు వాగుపై నిర్మించిన వంతెన

- నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

సుల్తానాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : లక్షల రూపాయల ఖర్చు చేసి నిర్మించిన వంతెనకు మోక్షం కలగడం లేదు. సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల్ల మానేరు వాగుపై వంతెన నిర్మాణం పూర్తయి ఆరేళ్లు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రజల రవాణా సౌకర్యం మెరుగుపడుతుందనుకున్న వారి ఆశలన్నీ అడియాశలవుతున్నాయి. వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడం వలన వాహనాల రాకపోకలకు వీలు పడడం లేదు. వంతెన నుంచి కుడి వైపు వెళ్లినా, ఎడమ వైపు వెళ్లినా మధ్యలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలు వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారాయి. దీంతో వంతెన ఎప్పుడు ప్రారంభవుతుందా అని ఆశతో ఎదురు చూస్తున్నారు.


వంతెనకు కుడి వైపు భారీ వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న కోమాండ్లపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి

• కొలిక్కి రాని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

వంతెనను ఉపయోగంలోకి తేవడంలో పలు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఓవైపు అప్రోచ్ రోడ్డు లేకపోవం, మరోవైపు రెండు వైపులా రైల్వే అండర్ బ్రిడ్జిలు అడ్డుగా ఉన్నాయి. వంతెన నుంచి కుడి, ఎడమ వైపు ఉన్న లోలెవల్ రైల్వే అండర్ బ్రిడ్జిల స్థానంలో హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించాల్సి ఉంది. లేదా ప్రస్తుత వంతెన నుంచి రైలు మార్గంపై నుంచి నీరుకుళ్ల-గర్రెపల్లి రోడ్డుపై వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం అయినా చేపట్టాల్సి ఉంటుంది. ఈ ఫ్లైఓవర్ నిర్మించడానికి ప్రస్తుత వంతెనను ఇంకా ముందుకు కొనసాగించేందుకు హైటెన్షన్ విద్యుత్ తీగలు అడ్డుగా ఉన్నాయి. దీంతో ప్రత్యామ్నాయ మార్గాల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు ఆరేళ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ అవి కొలిక్కి రావడంలేదు. వంతెన నుంచి రంగంపల్లి పెద్దమ్మ దేవాలయం వరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం రూ.27 కోట్లతో అంచనాలు తయారుచేసినా ప్రధానంగా భూసేకరణ సమస్య పరిష్కారం కావడం లేదని తెలిసింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

• వంతెనకు ప్రతిపాదనలు..

సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల మానేరు వాగుపై వంతన నిర్మాణ ఆవశ్యకతను, ప్రయాణ వెసులుబాటును, తగ్గే దూర భారం తదితర అంశాలను పరిగణనలోకి తీసు కొని ఆనాటి ఎమ్మెల్యేలు ప్రతిపా దనలు సిద్ధం చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి హయాంలో నాటి రోడ్లు, భవనాల శాఖ మంత్రి జీవన్‌రెడ్డికి సుల్తానా బాద్‌లో మినీ కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా అప్పటి ఎమ్మెల్యే గీట్ల ముకుంద రెడ్డి వంతెన అవశ్యకతపై విజ్ఞప్తి చేశారు. నిధులు మంజూ రైనా కానీ సకాలంలో పనులు చేపట్టకపోవడంతో వంతెన నిర్మాణం కార్యరూపం దాల్చ లేదు. తెలంగాణ ఏర్పడ్డాక 2015లో సీఎం కేసీఆర్‌కు ఆనాటి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి వంతెన నిర్మాణం గుర్తించి వినతి పత్రాన్ని సమర్పించారు. స్పందించిన సీఎం నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

• తగ్గనున్న దూర భారం..

సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల్ల వద్ద మానేరుపై వంతెనపై రాకపోకలు ప్రారంభమైతే ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రయాణీకులకు ఎంతో వెసులుబాటు కలగడంతో పాటు దూరభారం కూడా తగ్గనుంది. సుల్తానాబాద్ మండలం నీరకుల్ల మానకొండూరు మండలం వేగురపల్లి నుంచి నిత్యం ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన మీదుగా వెళితే తమకు 30-35 కిలోమీటర్ల దూరభారం తుగ్గుతుందని, వంతెన పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

• 2016లో శంకుస్థాపన..

తెలంగాణ ప్రభుత్వంలో అప్పటి మంత్రులు ఈటల రాజేందర్, హరీష్‌రావు తదితరులతో పాటు పలువురు ఎమ్మెల్యేల సమక్షంలో 12 జనవరి 2016న నీరుకుళ్ల వంతెన నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. రెండేళ్లలోనే పనులు పూర్తిచేయించారు. తర్వాత రాకపోకలు సవ్యంగా సాగుతాయని అందరూ ఆశించారు. కానీ వంతెన నుంచి ఎడమ వైపు వెళితే కోమాండ్లపల్లి రోడ్డులో ఒక రైల్వే అండర్ బ్రిడ్జి, కుడి వైపు వెళ్లితే నీరుకుళ్ల గ్రామం వద్ద మరో రైల్వే అండర్ బ్రిడ్జి ఉంది. ఈ మార్గంలో ఉన్న రెండు రైల్వే అండర్ బ్రిడ్జిలు చిన్నగా ఉండడంతో వాటి కింది నుంచి భారీ వాహనాలు లేని పరిస్థితి. దాంతో మానేరుపై నిర్మించిన వంతెన వల్ల ఉపయోగం లేకుండా పోతోంది. అధికారుల రైల్వే అండర్ బ్రిడ్జిలను పరిగణనలోకి తీసుకొని తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఉంటే వంతెన ఉపయోగంలోకి వచ్చి ఉండేది.

టీ-ఫైబర్ ద్వారా ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలు

- ఇంటి నుంచే 150 రకాల పౌర సేవలందించేందుకు మీ సేవ యాప్ సిద్ధం - పైలట్ ప్రాజెక్టు కింద 3 గ్రామాల్లో సేవలు ప్రారంభం
- హైదరాబాద్‌లో యాప్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

ముత్తారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సేవలను టీ ఫైబర్ ద్వారా అందించేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హైదరాబాద్‌లో టీ-ఫైబర్ యాప్ ను పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామ పంచాయతీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో రాష్ట్రంలో 7592కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆజాద్ ఇంజినీరింగ్, ప్రీమియర్ ఎనర్జీస్, గ్లోబల్ ఎన్విరాన్ మెంట్, లెన్స్‌కార్ట్ సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రజలకు అందించే టీ-ఫైబర్ యాప్ ద్వారా టెలిఫోన్, ఇంటర్నెట్, కేబుల్ టీవీ, కంప్యూటర్ వంటి అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని, వీటిని వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యా ప్తంగా ముందస్తుగా 3పైలెట్ గ్రామాలను ఎంపిక చేసి టీ-ఫైబర్ యాప్, ఇం టింటికీ ఇంటర్నెట్ కనెక్షన్స్ సౌకర్యాలు కల్పించామన్నారు. ఇందులో నుంచి వచ్చే అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలు విస్తరి స్తామని అన్నారు. టీ-ఫైబర్ ప్రాజెక్టు ద్వారా మొదటి సంవత్సరం ప్రభుత్వ కార్యాలయాల కు బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ అందిస్తామని అన్నారు. మీ సేవా ద్వారా 150 రకాల పౌర సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా మొబైల్ యాప్ సిద్ధం చేయడంతో పాటు రద్దీ ప్రాంతాల్లో క్యూఎస్కేలను ఏర్పాటు చేయనుందని అన్నారు. షాపింగ్‌మాల్స్, మెట్రో స్టేషన్లు, కలెక్టరేట్లు, ఇతర ప్రాంతాలు ఇంటరాక్టివ్ క్యూఎస్కే ద్వారా ప్రజలు పౌర సేవలు పొందవచ్చని, దరఖాస్తు నింపడం చెల్లింపులు చేయడం సర్టిఫికెట్ ప్రింట్ తీసుకునే అవకాశాలు కల్పిస్తామన్నారు. మీ సేవలో ప్రభు త్వం కొత్త సర్వీసులు చేర్చిందని, పర్యాటక శాఖ హోటల్స్, పర్యాటక ప్యాకేజీల బుకింగ్, దివ్యాంగుల గుర్తింపు కార్డులు, వయోవృద్ధుల సంక్షేమ కేసుల పర్యవేక్షణ సర్టిఫికెట్ల జారీ, అటవీశాఖకు సంబంధించి వన్యప్రాణుల బాధితులకు సహాయం, కొత్తవి జారీ, వాల్టా చట్టం కింద చెట్ల తొలగింపు, తరలించేందుకు అనుమతులు వంటి సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు.ప్రజలకు ఇబ్బుదులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మా ట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద అడవిశ్రీరాంపూర్ గ్రామాన్ని ఎంపిక చేసి ప్రతి ఇంటికి ఇంటర్నెట్ కనెక్షన్, టెలిఫోన్ కనెక్షన్ అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్ర మంలో డీపీవో వీర బుచ్చయ్య, జడ్పీ సీఈవో నరేం దర్, మంథని ఆర్డీవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేలోతు తండాలో చిరుత సంచారం


రైతులు గుర్తించిన చిరుత అడుగులు

వీర్నపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలంలోని వన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కేలోత్ తండాలో ధరంగుండు చెక్ డ్యాం ప్రాంతంలో చిరుత పులి గిరిజన రైతులకు కనిపించింది. శనివారం కేలోత్ తండాకు చెందిన రైతులు వ్యవసాయ పనులకు వెళ్లగా మధ్యాహ్న సమయంలో దూరంగా ఉన్న పొలం గట్లపైన చిరుత పులి కనిపించడంతో గిరిజన రైతులు భయభ్రాంతులకు గురై ఇంటికి పరుగులు తీశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌కు సమాచారం అందించినట్లు రైతులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పోలీస్‌లు పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలి స్తుండడంతో తనిఖీ చేసి వేణు, కుమార స్వామిల పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- నానమ్మ మృతి చెందిన మూడు రోజులకే మనుమడు మృతి
- మూడు రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో ఇద్దరు మృత్యువాత


రాజమొగిలి(ఫైల్)

వెల్గటూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిషన్‌రావుపేట గ్రామంలో ఒకే కుటుంబంలో మూడు రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి చెందారు. నానమ్మ మృతి చెందిన మూడు రోజులకే మనుమడు మృతి చెందడంతో ఆ ఇంట్లో విషాద ఛాయలు నెలకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిట్టల రాజమొగిలి (37) నానమ్మ పిట్టల భూమక్క మూడు రోజుల క్రితం మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఆమెకు ఆదివారం మూడు రోజుల కార్యక్రమం చేయడానికి కిషన్‌రావుపేట శివారులోని శ్మశాన వాటిక వద్దకు వెళ్లారు. అక్కడ కార్యక్రమం అనంతరం వ్యవసాయ బావి వద్ద స్నానాలు చేస్తుండగా రాజమొగిలి తమ్ముడు మల్లేష్, కొడుకు రిశ్వంత్ (13)కు కరెంట్ పైపు నుంచి విద్యుత్ షాక్ తగలడంతో అది చూసిన రాజమొగిలి వెళ్లి వారిని పక్కకు లాగాడు. ఈ క్రమంలో రాజమొగిలి విద్యుదా ఘాతానికి గురై అక్కడే పడిపోయాడు. వెంటనే రాజమొగిలిని స్థానికులు కరీంనగర్ ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రాజమొగిలి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మల్లేష్, రిశ్వంత్‌లు ప్రాణాలతో బయటపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. రాజమొగిలి భార్య పిట్టల సుమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. మృతుడు రాజమొగిలి ఇటీవలే అప్పు చేసి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య


షమీమ్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ షమీమ్ (46) అనే వ్యక్తి అప్పుల బాధ భరించలేక ఆదివారం సిరిసిల్ల మానేరు వాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. షమీమ్ కుటుంబ పోషణ నిమిత్తం టైలరింగ్ నిర్వహించుకునే వాడు. ఇటీవల తన కుమార్తె వివాహం చేయగా చిన్న కూతురు వివాహం అప్పుల బాధతో ఎలా చేయాలో తోచక మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో మూగజీవాలు మృత్యువాత


మూగజీవాలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారులు, నాయకులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన ముడావత్ భీంరావు అనే మేకల కాపరికి చెందిన మూడు జీవాలు, రెండు శునకాలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. మేకల కాపరి భీంరావును కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. వివరాల్లోకి వెళ్తే భీంరావు ఇంటి పక్కన విద్యుత్ స్తంభానికి ఆనుకుని గొర్రెల షెడ్డును నిర్మించాడు. షెడ్డు చుట్టూ ఇనుప జాలీని ఏర్పాటు చేయగా అక్కడే ఉన్న విద్యుత్ స్తంభం సింగిల్‌ఫేజ్ 25కెవి డీటీఆర్‌కు ఇనుప జాలీ ఆనడంతో విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో పాకలో ఉన్న మూగజీవాలు, రెండు శునకాలు జాలికి తాకడంతో అక్కడికక్కడే శుక్రవారం మృతి చెందాయి. 80 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న సెస్ ఏఈ పృథ్వీ, లైన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డితో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కాపరి ఆందోళన చెందవద్దని, సెస్ ద్వారా నష్టపరిహారం అందేలా చూస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. వారి వెంట పార్టీ ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపీడీవో మృతి

బుగ్గారం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న మాడిశెట్టి శ్రీనివాస్(52) శనివారం రాత్రి కరీంనగర్ లోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందాడు. ఫిబ్రవరిలో జరిగిన బదిలీల్లో ఆయన బుగ్గారం ఎంపీడీవో గా బదిలీ అయ్యారు. విధి నిర్వహణలో నిన్న సాయంత్రం వరకు జగిత్యాలలో తోటి అధికారులతో తన సిబ్బందితో గడిపిన ఆయన గుండె పోటుతో మృతి చెందడంతో తోటి ఉద్యోగులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం మండల అధ్యక్షుడు వేముల సుభాష్‌తో పాటు బుగ్గారం కాంగ్రెస్ నాయకులు ఎంపీడీవో అంత్యక్రియలో పాల్గొని సానుభూతి తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు

ధర్మపురి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాసుగంటి హను మంతరావు కోరారు. ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. పెండింగ్ బిల్లుల సత్వర పరిష్కారం కోసం డిసెంబరు 17న టీపీయూఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ధర్మదీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ డీఏలు, పీ ఆర్‌సీ నివేదికను తెప్పించుకుని అమలు చేయాలన్నారు. జీవో 317 ద్వారా నష్టపోయిన ప్రతీ ఉద్యోగికి న్యాయం చేయాలన్నారు. సూపర్ న్యూమరీ పోస్టులు క్రియేట్ చేసి వారికి పోస్టింగ్ ఆర్డర్లు వారి స్థానికత ఆధారంగా ఇవ్వాలన్నారు. సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలన్నారు. సమావేశంలో టీపీయూఎస్ రాష్ట్ర కార్య దర్శి రొట్టె శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బండి మహేష్, జిల్లా కార్యదర్శి కాశెట్టి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శీలం రాజేష్, మండల అధ్యక్షులు కాశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కనపర్తి సంతోష్, మండల బాధ్యులు గడిపెల్లి కిరణ్ పాల్గొన్నారు.

నారు మడిలో సస్య రక్షణ

• వరి సాగులో నారు పెంపకం కీలకం

ఇల్లందకుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో నారుమడి కీలకం. నారు బాగుంటే అధిక దిగుబడి సాధించవచ్చు. ఈ ఏడాది వర్షాకాలంలో సమృద్ధిగా కురిసిన వర్షాలతో చెరువులు, డ్యామ్‌లు నిండుకుండలా ఉన్నాయి. ప్రస్తుత యాసంగికి పంట వేసేందుకు రైతులు నారుమడులు సిద్ధం చేసి విత్తనాలు అలికారు. డిసెంబరు 15 వరకు నారుమడులు పోసినట్లయితే అధిక దిగుబడి రావడానికి అవకాశాలు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు.

• నారుమడి పెంపకం..

నారుమడిని బాగాదున్ని రెండుమూడు సార్లు దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసి నారు మళ్లను తయారు చేయాలి. రెండు గుంటల నారుమడికి 2కేజీల నత్రజని, 1కేజీ భాస్వరం, 1కేజీ పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలి. పశువుల పేడను, ఇతర సేంద్రీయ ఎరువులను దుక్కిలో వేయడం చాలా మంచిది. మొలక కట్టిన విత్తనాన్ని చల్లి, మొదట్లో ఆరుతడులు ఇచ్చి, తర్వాత మొక్క దశలో పలుచగా రెండు మూడు సెంటీమీటర్ల వరకు నీరు ఉంచాలి. జింక్ లోపం సవరణకు లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలి. మెట్ట నారుమడిలో ఇనుప దాతు గమనిస్తూ సరి చేయాలి. నారుమడి పీకే వారం రోజుల ముందు ఒక గుంట నారుమడికి 400 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఇసుకతో కలిపి చల్లి పలుచగా నీరుంచాలి. అవసరాన్ని బట్టి మడిలో ఇతర సస్య రక్షణ చర్యలు చేపట్టాలి.


ఇల్లందకుంటలో పోసిన నారుమడి

• ప్రధాన పొలం తయారీ, మొక్కల సాంద్రత...

నాట్లు వేయడానికి 15రోజుల ముందుగానే పొలాన్ని దుమ్ము చేయుట ప్రారంభించి రెండు మూడు దఫాలుగా మురగ దుమ్ము చేయాలి. నాలుగు నుంచి ఐదు ఆకులున్న నారును నాటుకోవాలి. కొద్దీగా చౌడున్న పొలాల్లో లేత నారు వేయవద్దు. మట్ట ముదురాలి, భూసారాన్ని రకాన్ని బట్టి, కాలాన్ని బట్టి చదరపు మీటర్‌కు కుదుళ్ల సంఖ్య మారుతుంది. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల బాటలు తీయడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి అదుపులోకి వస్తుంది. నారు బాగా ముదిరి ఆలస్యంగా నాటినప్పుడు కుదుళ్ల సంఖ్యను పెంచి కుదురకు 6-8 మొక్కల చొప్పున నాటు వేయాలి. అలా ముదురు నారు నాటినప్పుడు నత్రజని ఎరువును సిఫార్సు కంటే 25శాతం పెంచి మూడు దఫాలుగా కాకుండా రెండు దఫాలుగా అంటే 70శాతం నాటే సమయంలో మిగతా 30 శాతం అంకురం దశలో వేయాలి.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

- ముప్పిడి సూర్యనారాయణ, మండల వ్యవసాయాధికారి, ఇల్లందకుంట



రైతులు వరినారు విత్తనాల ఎంపికలో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. విత్తన ఎంపికలో మోసపోకుండా దిగుబడి ఎక్కువగా వచ్చే విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. నారుమళ్లు పోసుకోవడానికి డిసెంబరు 15 వరకు అవకాశం ఉంది.



కరీంనగర్ బస్టాండ్ వద్ద మురుగునీటితో నిండిన డ్రైనేజీలు



చెత్తాచెదారంతో నిండిన ప్రయాణ ప్రాంగణం ఆవరణ

అస్తవ్యస్తంగా ప్రయాణ ప్రాంగణం

- దుర్వాసనతో ప్రయాణికుల ఇక్కట్లు
- తాగునీటి ఆర్‌వో పరిసరాల్లో అపరిశుభ్రత
- కుక్కల బెడదతో ఇబ్బందులు

భగత్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రయాణ ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. నిత్యం కరీంనగర్ నుంచి హైదరాబాద్, బెంగుళూరు, విజయవాడ, గుంటూరుతో పాటు వివిధ ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ప్రయాణం చేస్తుంటారు. కరీంనగర్ బస్టాండ్‌లో మురుగు కాలువలు తీయక పోవడంతో దుర్వాసన వస్తోంది. బస్టాండ్‌లోని హోటల్స్, షాపులు, లాడ్జిల నుంచి వ్యర్థ పదార్థాలు డ్రైనేజీల్లోకి వదులుతుండడంతో భరించలేని దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రయాణికులు తెచ్చుకున్న వాటర్ బాటిల్స్, తినుబండా రాల ప్యాకెట్లు, కవర్లు ఫ్లాట్ ఫాంలపై పడవేస్తున్నారు. బస్టాండ్‌ను ప్రతి రోజూ శుభ్రపరిచే శానిటేషన్ సిబ్బంది లేకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయని పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. మంచినీటి ఆర్‌వోల పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం నిండి ఉండడంతో ప్రయాణికులు తాగేందుకు జంకుతున్నారు.



బస్సులు బయటికి వెళ్లే మార్గం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు

ట్రాఫిక్ అస్తవ్యస్తం

కరీంనగర్ ప్రయాణ ప్రాంగణం ముఖ ద్వారంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. కార్లు, ద్విచక్ర వాహనాలు బస్టాండ్‌లోకి వస్తుండడంతో బస్సులు ఎక్కేందుకు వెళ్తున్న ప్రయాణికులతో పాటు, దిగి వెళ్తున్న ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. బస్టాండ్ ఫ్లాట్ ఫాంలపైనే పదుల సంఖ్యలో కుక్కలు తిరుగుతుండడంతో ప్రయాణికులు భయభ్రాం తులకు లోనవుతున్నారు. ఫ్లాట్‌ఫాంల వద్ద ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీల కింద నిత్యం కుక్కలు పడుకుంటుండడంతో కూర్చునే పరిస్థితి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణ ప్రాంగణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక



ఇల్లంతకుంట విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్

ఇల్లంతకుంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు ఎంపికయ్యారు. గాలిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అమిత అనే విద్యార్థిని గైడ్ టీచర్ యాద రవి సహకారంతో ఫోల్డేబుల్ చైర్ రూపొందించి పలువురి ప్రశంసలు అందుకుంది. రోడ్డు ప్రక్కన పూలు, పండ్లు కూరగాయలు అమ్ముకునే వ్యాపారులు అకస్మాత్తుగా కురిసే వర్షాలతో ఆర్థికంగా నష్టపోతున్నారు. దీనిని గమనించిన అమిత సరకులను తొందరగా సర్దుకోవడానికి వీలుండే విదంగా ఫోల్డేబుల్ చైర్‌ను రూపొందించింది. ఇల్లంతకుంటలోని జిల్లాపరిషత్ పాఠశాలలో చదువుతన్న ఒడ్నాల రేష్మ అనే విద్యార్థిని గైడ్ టీచర్ మహేష్‌చంద్ర సహకారంతో ఉమెన్ ఆయిట్ అనే ఎగ్జిబిట్‌ను ప్రదర్శించింది. ఇదే పాఠశాలలో చదువుతున్న పడిగె భవిత్ అనే విద్యార్థి గైడ్‌టీచర్ మధుసూదన్‌రావు సహకారంతో రైతు స్నేహపూర్వక సాధనం అనే ప్రాజెక్టును రూపొందించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇల్లంతకుంటలోని కేరళ మోడల్ స్కూల్‌లో చదువుతున్న ఆర్షీన్ అనే విద్యార్థి గైడ్‌టీచర్ బాలకృష్ణ సహకారంతో పరిశ్రమల వ్యర్థాల ఉద్గారాల శుభ్రత అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



అమిత తయారు చేసిన ప్రాజెక్టు

పోగొట్టుకున్న ఫోన్ భక్తుడికి అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఆలయ ఉద్యోగి

ధర్మపురి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో బస్‌స్టేషన్ సమీపంలో గల శ్రీ లక్ష్మీనరసింహసదన్ ధర్మశాలలో ఒక భక్తుడు పోగొట్టుకున్న సెల్ ఫోన్ దొరికిన ఆలయ ఉద్యోగి, ఇన్‌చార్జి వంశీకృష్ణ ఆదివారం ఆయనకు అప్పగించాడు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన భక్తుడు దైవ దర్శనానికి వచ్చి బస్‌స్టేషన్ సమీపంలో గల లక్ష్మీనరసింహసదన్‌లో బస చేశాడు. ఉదయం తనకు సంబంధించిన 17 వేల రూపాయలు విలువ గల సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆ ఫోన్ దొరికిన ఆలయ ఉద్యోగి, ఇన్‌చార్జి వంశీకృష్ణ వెంటనే ఈవో సంకటాల శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. ఈ మేరకు భక్తుడికి కౌంటర్ వద్దకు పిలిపించి అప్పగించారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల ఆవరణ



మందుబాబులు తాగి పడేసిన సీసాలు

కొడిమ్యాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న మండలంలోని పూడూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణ మందుబాబులకు అడ్డగా మారింది. పాఠశాలకు గతంలో నిర్మించిన ప్రహరీగోడను కొంత భాగం గతంలో గుర్తు తెలియని వ్యక్తులు కూలగొట్టారు. దీంతో అక్కడి నుంచి రాత్రి సమయంలో పలువురు వచ్చి పాఠశాల ఆవరణలో మద్యం తాగుతున్నారు. మద్యం మత్తులో బీరు సీసాలు పగులకొడుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు కొనసాగుతున్నాయి. ప్రహరీ గోడ సరిగా లేకపోవడంతో ఏడాది క్రితం అధికారులు ఏర్పాటు చేసిన సోలార్ లైట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారని ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సంబంధిత అధికారులు పట్టించుకొని ప్రహరీ నిర్మించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



ధర్మపురిలో స్నానాలు ఆచరిస్తున్న మల్లన్న భక్తులు

భక్తజన సంద్రమైన మల్లన్న జాతర



బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

గొల్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జున స్వామి జాతర భక్తజన సంద్రమైంది. ఉత్సవాల్లో భాగంగా మొదటి ఆదివారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులు బెల్లం పానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకుని, బంతిపూలు మెడలో ధరించి ఒగ్గు పూజారుల ఢమరుకనాదాల నడుమ ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలిలివచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పసుపు, బెల్లం, బంతిపూలు సమర్పించారు. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో మల్లన్న పట్నాలు వేసి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారులు కొండూరి రాజేందర్ శర్మ, కొండూరి రఘు వేదమంత్రోచ్ఛ రణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి రూ. 72010 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. జాతరలో ఏలాంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఉత్సవాలను ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ పర్యవేక్షించారు.

- వర్షంతో భక్తుల ఇక్కట్లు..

ఆదివారం జరిగిన జాతర ఉత్సవాల సందర్భంగా మల్లన్న పేటలో అకగంట పాటు ఓ మోస్తరు ఆకాల వర్షం కురిసింది. దీంతో భక్తులు ఇక్కట్ల పాలయ్యారు. ఆలయ పరిసర ప్రదేశాలతో పాటు ఆలయం నలుదిక్కుల పంటపొలాల్లో, ఆరుబయట భక్తులు బస చేయ డంతో ఆకాల వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉత్సవాలకు తల్లిదండ్రులతో కలిసి వచ్చిన ఆకుల హిమాన్షు అనే రెండేళ్ల బాలుడు జాతరలో తప్పిపోయాడు. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ బాలుడిని వెతికి పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించాడు.

ధర్మపురి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నదిలో ఆదివారం మల్లన్న భక్తులు స్నానాలు ఆచరించారు. భక్తులు తలపై మల్లికార్జున విగ్రహాల పెట్టెను పెట్టుకుని త్రిశూలం చేత పట్టుకుని ధర్మపురి క్షేత్రానికి తరలివచ్చారు. అనంతరం భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు చేశారు. అలాగే నదీ జలాలతో విగ్రహాలను శుభ్రం చేసి స్నానఘట్టాల పైన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇసుక లింగాల వద్ద ఉంచి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు త్రిశూలం, ఒగ్గు డోలు చేత పట్టుకుని మెడలో పూల దండ వేసుకుని భక్తి పాటలు పాడుతూ భక్తులు విగ్రహాల పెట్టెలతో తిరుగు ప్రయాణం చేశారు. పట్నాలు వేసిన మరునాడు వేములవాడ, కొమరవెల్లి, ఓదేల, ఐనవోలు ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకునేందుకు వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది.

విద్యుదాఘాతంతో విద్యార్థికి తీవ్ర గాయాలు

కోరుట్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోగినిపల్లి గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న తేలు మణి అనే విద్యార్థికి విద్యుత్ షాక్ తగిలి తీవ్రగాయాల పాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. తేలు మణి తన స్నేహితులతో కలిసి గ్రామంలో షటిల్ కోర్టు ఏర్పాటు చేసుకున్నారు. సమీపంలో ఉన్న విద్యుత్ సంభం నుంచి విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం తన స్నేహితులతో షటిల్ ఆడుతుండగా ప్రమాదవశాత్తూ మణికి విద్యుత్ తీగలు తగిలి షాక్ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే మణిని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని అక్కడి వైద్యులు చెప్పడంతో హైదరాబాదు తరలించారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం భక్తులు తెల్లవారు జామున ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని, ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం కోసం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు పార్వతీప రమేశ్వరులను దర్శించుకున్నారు. భక్తులు కోడెమొక్కు చెల్లించుకుని అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజ చేశారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా పోచమ్మ బోనాలు



అనంతారంలో బోనాలు నిర్వహిస్తున్న మహిళలు

ఇల్లంతకుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం గ్రామంలో ఆదివారం ఘనంగా పోచమ్మ బోణాలు నిర్వహించారు. గ్రామంలో బొడ్రాయిని ఏర్పాటు చేసి సంవత్సరం కావడంతో బోనాలు నిర్వహించారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను కేంద్రం వెంటనే రద్దు చేయాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కోరుట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీనారే భవనంలో నిర్వహించిన సీపీఎం జిల్లా మహాసభలో రాష్ట్ర నాయకులు భాలకృష్ణ, శ్రీకాంత్, సుందర్‌లతో కలిసి పాల్గొన్నారు. మహాసభల సందర్భంగా పట్టణంలోని జాతీయ రహదారిపై సీపీఎం నాయకులు కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. మొదట సినారే భవనంలో అమరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లాతో పాటు వివిధ జిల్లాలో ప్రజా సమస్యలను గుర్తించి చేయాల్సిన నిరసనలపై చర్చించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మతాల పేరుతో ప్రజలను రెచ్చగొడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ విధానాలను మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తిరుపతి నాయక్, ఎంఎ చౌదరి, ఇందూరి సులోచన, నాయిని శారధ, భగత్, భూషణ్, రమేష్, మల్యాల సురేష్, పద్మ, లక వత్ మహిపాల్ నాయక్, రజియా సుల్తానా, కొంచం శంకర్, గుమ్మడి రమేష్, ఎల్ల పోశయ్య తదితరులు మాట్లాడారు.

చరిత్రకు సాక్ష్యం..
రాయికల్ త్రికూటాలయం

- తగిన ఆదరణ లేక కనుమరుగు
- అభివృద్ధి చేయాలని భక్తుల డిమాండ్

రాయికల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన త్రికూటాలయం తగిన గుర్తింపు లేక ఆలయ చరిత్ర కనుమరుగవుతోంది. గతంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించినా పూర్తి స్థాయిలో వాటిని వినియోగించలేదు.



రాయికల్‌లోని త్రికూటాలయం

ఆలయ చరిత్ర

క్రీ.శ.1305లో కాకతీయ రాజుల పరిపాలనలో చెన్న కేశవనాథ త్రికూటాలయం నిర్మితమైంది. సుమారు ఏడు వందల ఏళ్ల క్రితం రాయికల్‌లో నిర్మించిన ఈ ఆలయంతోనే రాయికల్ చరిత్ర ముడి పడి ఉంది. ఆలయంలో ఉన్న పంచముఖ లింగం ఎంతో విశిష్టమైంది. ఈ ఆలయంలో సూర్యనారాయణ స్వామి, పంచముఖ లింగం, వేంకటేశ్వరస్వామి ముగ్గురూ ఒకే చోట కొలువు దీరడంతో ఆలయానికి త్రికూటాలయం అని పేరు వచ్చింది. ఆలయ అభివృద్ధికి ఏఎస్ఎల్ పార్సిల్ ఎండీ సీహెచ్ఎస్‌వి కృష్ణారావు నివేదితా దంపతులు, పట్టణ ప్రజల సహకారంతో ఆలయంలో విగ్రహాల పునప్రతిష్ఠ చేసి ఆలయ ప్రాంగణంలోనే నూతనంగా వినాయక ఆలయం నిర్మించి కొంతవరకు ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. ప్రభుత్వం నుం చి నిధులు లేకపోవడంతో ఆలయం పూ ర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడంలేదు.

అభివృద్ధికి నిధులు కరువు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఈ ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించినప్పటికీ ఆలయ మరమ్మతులకు నిధులు లేకపోవడంతో పాటు ఆలయ చరిత్రను కాపాడేవారే కరువయ్యారు. పట్టణంలోని పలువురు నాయకులు ఆలయ విశిష్టత కాపాడుతూ పలు ఉత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి నిధులు లేకపోవడంతో ఆలయ అభివృద్ధి జరగడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆలయంలోని పంచముఖ లింగం

ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- ఏనుగు మల్లారెడ్డి, రాయికల్



ఏళ్ల చరిత్ర కలిగిన చెన్నకేశవనాథ ఆలయానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి. అత్యంత పురాతన పంచముఖ లింగం అరుదుగా ఉండే ఆలయాల్లో కేశవనాథ ఆలయం ఒకటి. ఆలయ చరిత్రను కాపాడి అభివృద్ధి చేయాలి. పర్యాటక ప్రాంతంగా గుర్తించి నిధులు మంజూరు చేయాలి.

పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి

- తుమ్మల సదాశివరెడ్డి(నాని), రాయికల్.



ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చెన్నకేశవనాథ ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా చూపించారు. నూతన జిల్లాలోనూ పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి. ఆలయ ప్రాంగణంలో గదులు నిర్మించి అభివృద్ధికి నిధులు విడుదల చేసి ఆలయ చరిత్రను కాపాడాలి.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి


మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతులను కల్పించడంతోపాటు విద్యార్థుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని బీసీ హాస్టల్‌ను ఆదివారం ఏబీవీపీ నాయకులు సందర్శించి విద్యార్థుల గదులతోపాటు భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ గదుల్లోకి దోమలు, దుమ్మూధూళి రావడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు లేవన్నారు. చలికాలంలో గ్రీజర్లు పనిచేయకపోవడంతో విద్యార్థులు చల్లని నీటితోనే స్నానం చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. కలెక్టర్ స్పందించి హాస్టల్స్‌లో గ్రీజర్లను ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడవకముందే 51 మంది విద్యార్థుల ప్రాణాలను బలితీసుకుందన్నారు. గురుకుల హాస్టల్స్‌లో విద్యార్థుల మరణాలపై వారి సమస్యలపైన హైకోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ జరించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి హాస్టల్స్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకుని పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు, అశీష్, కార్తీక్, అక్షయ్, విజయ్, గణేష్, భారత్, రోహిత్, పవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంబురం

(5 వ పేజీ తరువాయి..)

రూ. 43 లక్షలతో సీసీ ఫ్లోరింగ్, రూ. 18 లక్షలతో మురికి కాలువలు, రూ. 50 లక్షలతో గోశాల షెడ్‌కు నిధులు కేటాయించారు. రూ. 35 కోట్ల అంచనాలతో అన్నదాన సత్రం నిర్మాణానికి భూమిపూజ చేశారు.

● సిరిసిల్ల నేతన్నకు భరోసా...

సిరిసిల్ల నేతన్నలకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం క్లాత్ ఉత్పత్తి ఆర్డర్లకు రూ 28.84 కోట్లు అందించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రావాల్సిన బతుకమ్మ చీరలు, ఇతర ఆర్డర్లకు సంబంధించిన బకాయిలు రూ. 379 కోట్లు చెల్లించారు. తాజాగా 66 లక్షల మీటర్ల అర్వీఎం క్లాత్ ఆర్డర్లు ఇచ్చే ఏర్పాట్లు చేశారు. స్వశక్తి సంఘాల మహిళలకు రెండు చీరల చొప్పున అందించడానికి కోటి 30 లక్షల చీరల ఉత్పత్తి ఆర్డర్లు కూడా ఇచ్చే విధంగా చర్యలు చేపట్టారు. సిరిసిల్ల నేతన్నలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నా యారన్ డిపోను రూ. 50 కోట్లతో వేములవాడ కేంద్రంగా ఏర్పాటు చేశారు. 90 శాతం క్రెడిట్‌పై కార్మికులకు యారన్ అందిస్తున్నారు. 11,698 మంది కార్మికులకు త్రిఫ్ట్ కింద రూ. 36 కోట్లు అందించారు. నేతన్నకు బీమా కింద 43 మందికి ఐదులక్షల చొప్పున అందించారు. యారన్ సబ్సిడీ రూ. 37 కోట్లు చెల్లించారు.

● అన్నదాతలకు రూ. 380 కోట్ల రుణమాఫీ

జిల్లాలో ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీకి సంబంధించి మూడు విడతల్లో చెల్లింపులు చేసింది. 47,977 మంది రైతులకు రూ. 381.46 కోట్లు రుణమాఫీ చేశారు. రైతులకు భరోసాను కల్పించారు. జిల్లాలో 248 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వానాకాలం సీజన్‌కు సంబంధించి 33,691 మంది రైతుల నుంచి 1.98 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, 5,500 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని సేకరించారు. రూ. 414 కోట్ల ధాన్యాన్ని సేకరించారు. సన్నరకం ధాన్యానికి 500 రూపాయల బోనస్ కింద రూ. 27.88 లక్షలు చెల్లించారు. జిల్లాలో సీసీఐ ద్వారా 5,792 మంది రైతుల నుంచి 1,11,215 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి రూ. 83 కోట్లను చెల్లించారు.

● పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి

జిల్లాలో సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. కాళేశ్వరం ప్యాకేజీ-9లో రూ 1,180 కోట్లతో ఇప్పటి వరకు 81 శాతం పూర్తి చేశారు. మిగతా పనుల కోసం రూ 340కోట్లు కేటాయించారు. ప్యాకేజీ పనులు పూర్తిచేస్తే సిరిసిల్ల నియోజకవర్గంలోని సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి, ముస్తాబాద్ మండలాల్లో 56,000 ఎకరాలు, వేములవాడ నియోజకవర్గంలోని కోనరావుపేటలో 30,000 ఎకరాలకు సాగునీరు అందుతుంది. 10వ ప్యాకేజీ పనులు 90 శాతం పూర్తి చేశారు. మిగతా పనులకు రూ 134కోట్లు కేటాయించారు. దీని ద్వారా ఇల్లంతకుంట మండలంలో 15,000 ఎకరాలు సాగులోకి రానుంది. 11వ ప్యాకేజీలో 75 శాతం పనులు పూర్తి చేశారు. మిగతా పనులకు రూ 152 కోట్లతో పనులు పూర్తి చేయనున్నారు. దీని ద్వారా సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాల్లో 32,000 ఎకరాలకు నూతనంగా సాగునీరు అందనుంది. 22,000 ఎకరాల అయకట్టు స్థిరీకరణ జరగనుంది. బోయినపల్లిలో 10,000 ఎకరాలు, ఆయకట్టుకు నీరందుతుంది. 12వ ప్యాకేజీలో 94 శాతం పనులు పూర్తి చేశారు. మరో రూ 50 కోట్లతో పనులు పూర్తి చేయనున్నారు. దీని ద్వారా గంభీరావుపేట ముస్తాబాద్ మండలాల్లో 22,000 ఎకరాలు నూతంగా సాగులోకి రానుంది. మల్కపేట రిజర్వాయర్ పనులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.

● మిడ్ మానేరు నిర్వాసితులకు చేయూత..

మిడ్ మానేరు నిర్వాసితులకు చేయూతను అందించే దిశగా ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇళ్లులేని నిర్వాసితుల్లో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు, ఎస్సీ ఎస్టీలకు ఆరు లక్షల రూపాయలు అందించనుంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటి దశలో 3,500 ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుండగా 4,696 ఇందిరమ్మ ఇళ్లను నిర్వాసితులకు మంజూరు చేశారు.

● 260 మందికి ఉద్యోగాలు..

ప్రభుత్వం సర్కారు పాఠశాలలను బలోపేతం చేసేదిశగా ఖాళీల భర్తీకి పూనుకుంది. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ సెంటర్లుగా అభివృద్ధి చేయడంతో పాటు డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టింది. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 283 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. జిల్లాలో 136 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీ, భాషపండితులు, పీఈటీ పోస్టులు, భర్తీ చేసి నియామక పత్రాలను అందించారు. 455 మంది టీచర్లకు ప్రమోషన్లు, గ్రూప్-4 ద్వారా 124 మందికి ఉద్యోగాలు అందించారు.


బస్సులో జీరో టికెట్ చూపుతున్న మహిళలు(ఫైల్)

● రూ 500 కోట్ల వరకు లబ్ధి..

ఆరు గ్యారంటీల పథకాల ద్వారా జిల్లాలో రూ 500 కోట్ల వరకు లబ్ధి చేకూరింది. మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫాం కుట్టు పనిని అందించారు. జిల్లాలో కలెక్టరేట్, మెడికల్ కాలేజీ, ఇల్లంతకుంటలో మహిళశక్తి క్యాంటీన్లను ప్రారంభించారు. 12 రకాల వ్యాపార యూనిట్లకు ప్రణాళికలు రూపొందించారు. ఉపాధిహామీ ద్వారా 96 వేల జాబ్‌కార్డులను అందించారు. మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సులో ఉచితబస్ ప్రయాణం విజయవంతంగా కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ 61.60 కోట్ల విలువైన 1.64 కోట్ల జీరో టికెట్లపై మహిళలు ప్రయాణం చేశారు. జిల్లాలో రూ. 500లకే గ్యాస్ సిలిండర్ పథకంలో 93,104మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ 7.35 కోట్ల సబ్సిడీని జమ చేశారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల జీరో బిల్లుకు రూ 37.50 కోట్లు చెల్లించారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, ఒంటరి మహిళకు ఉపాధి కల్పించేందుకు ఐదు కోట్ల వ్యయంతో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. 24 మందికి ఉద్యోగాలు అందించారు. కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్‌లను అందించారు. మత్స్యశాఖ ద్వారా 440 చెరువుల్లో 70.58 లక్షల చేపపిల్లలను వదిలారు. జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించారు. భవిష్యత్తులో ప్రజల అవసరాలను తీర్చే దిశగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వేను చేపట్టారు. 192432 ఇండ్ల సర్వేకు సంబంధించిన డేటా ఎంట్రీ చేస్తున్నారు. క్రీడాకారులను ప్రొత్సహించే దిశగా సీఎం కప్ నిర్వహిస్తున్నారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యాక్రమాలను చేపట్టారు. అభివృద్ధికి సంబంధించి ప్రజాపాలనను ప్రభుత్వం అందించిందని కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నారు.

జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లాస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఆదివారం జరిగాయి. మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సంగ స్వామి అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని మండలాల నుంచి వివిధ విభాగాల్లో వివిధ వయస్సులోని పురుషులు, మహిళలకు జరిగిన ఎంపిక పోటీలలో ప్రతిభ కనబరించిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మునీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గొట్టిముక్కుల శేఖర్, సహాయ కార్యదర్శి మాదాసు లక్ష్మన్, కోశాధికారి నాయిన శంకర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యవర్గం నియామకం

వేములవాడ రూరల్: రాజన్న సిరిసిల్లా జిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ (మా)జిల్లా అధ్యక్షుడిగా సంగ స్వామియాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా చింతలపల్లి మునీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గడ్డం సత్యనారాయణ రెడ్డి, గొట్టే శేఖర్, జాయింట్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా డాక్టర్ లక్ష్మణ్, కోశాధికారిగా నాయిని శంకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కటకం చంద్రయ్య, మహిళవిభాగం జనరల్ సెక్రటరీగా రామాంజమ్మ నియామకమయ్యారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పుల గంగాధర్, మహేష్ లింగంపల్లి కిరణ్, బూర్ల శ్రీనివాస్, క్రీడాకారులు, పాల్గొన్నారు


మాస్టర్ అథ్లెటిక్స్ కార్యవర్గ సభ్యులు

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

కోనరావుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కచ్చకాయల ఎల్లయ్యను ఆదివారం తన నివాసంలో మండల శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ నియామకానికి కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, మండల కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వంగపల్లి పరుశరాములు, వంగపల్లి దేవరాజు, భూమలింగం, మొగిలిపాలెం మల్లేశం, వంగపల్లి బాలయ్య, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఎండపల్లి, డిసెంబర్ 08(ఆంధ్రజ్యోతి):ఈ నెల 9వ తేదీన నారాయణఖేడ్ జిల్లా ముండిమల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలకు మండలంలోని ఎండపల్లి గ్రామానికి చెందిన పులి రూబీ రతన్, భూసారపు హానిక ఎన్నికయ్యారు. ఈ క్రీడా పోటీలలో వీరిద్దరు పాల్గొననున్నారు. క్రీడా పోటీలకు ఎన్నికైన సందర్భంగా వాలీబాల్ క్రీడా అభిమానులు, గ్రామ స్థులు వీరిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ సెక్రెటరీ మారపెల్లి క్రిష్ణరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, అభి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా రెండో బైపాస్ రోడ్డు

- రోడ్డుపై ధాన్యం కుప్పలు, బండరాళ్లు - గమనించకుండా ప్రమాదాలకు గురవుతున్న వాహనాదారులు - స్పందించని అధికారులు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల రెండో బైపాస్‌రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిపోయింది. ధాన్యం కొనుగోళ్లు ముగిసినా మిగిలిన ధాన్యం, కవర్లు, వాహనాలు ధాన్యం కుప్పలవైపు రాకుండా అడ్డుగా పెట్టిన స్టాపర్లను తీయకపోవడంతో వాహనాదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు జంక్షన్ నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వరకు 11 కిలోమీటర్ల దూరం ఫోర్‌లైన్‌ల తో రెండో బైపాస్ రోడ్డును ఇటీవల నిర్మించారు. రోడ్డుకు ఇరుపక్కల సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనం చేసిన రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్ధాపూర్ గ్రామాలు ఉండగా ఆయా గ్రామాల్లో ధాన్యం పండించిన రైతులు ధాన్యాన్ని అమ్ముకునేందుకు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు లేకపోవడం, ధాన్యం పోసేందుకు స్థలాలు లేకపోవడంతో రైతులందరు గత్యంతరంలేక నూతనంగా నిర్మించిన డబుల్‌రోడ్డునే ధాన్యం కుప్పలు పోశారు. దీంతో గమనించకుండా వచ్చే వాహనాదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. గత అక్టోబరు నెలలో చిన్నబోనాల గ్రామ శివారులోని రెండో బైపాస్ రోడ్డులో పోసిన ధాన్యం కుప్పలను ఢీకొని చంద్రంపేట గ్రామానికి చెందిన యువకుడు మృత్యువాత పడ్డాడు. దీంతో పోలీసులు, అధికారులు కలిసి ఏడు గ్రామాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, ధాన్యం కొనుగోలు చేసే నిర్వహకులతో సమావేశాన్ని ఏర్పాటుచేసి రెండో బైపాస్ రోడ్డులోని ఒక వైపునకు మాత్రమే ధాన్యం ఆరబోయించి సకాలంలో కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని కేటాయించిన రైస్‌మిల్లుకు తరలించి నవంబరు చివరి వారంలో ముగించారు. పెద్దూర్ శివారులోని అపెరల్ పార్క్ ముందు కొంతమంది రైతులు అమ్ముకోగా మిగిలిన ధాన్యాన్ని కుప్పలు పెట్టుకున్నారు. బైపాస్ రోడ్డులో వాహనాలు ధాన్యం కుప్పలపైకి రాకుండా అడ్డుగా పెట్టుకున్న స్టాపర్లను సైతం రైతులు తొలగించకపోవడంతో రాత్రిపూట రోడ్డుపై వెళ్లుతున్న వాహనాదారులు రోడ్డుపై ఉన్న కుప్పలతోపాటు స్టాపర్లను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రోడ్డుపై ధాన్యం కుప్పలతోపాటు స్టాపర్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్ప

ధాన్యం కుప్పలతో నిత్యం ప్రమాదాలు

- సందవేని శ్రీనివాస్ యాదవ్, రగుడు



సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రెండోబైపాస్ రోడ్డుపై ధాన్యాన్ని ఆరబెట్టడంతోపాటు కుప్పలు పోయడం వల్ల వాహనదారులు చీకట్లో గమనించకుండా ధాన్యం కుప్పలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ధాన్యం కుప్పలను తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

స్థలం కేటాయించాలి

- ఎరవెల్లి వెంకటరమణారావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ పెద్దూర్



విలీన గ్రామాల్లో ధాన్యాన్ని విక్రయించేందుకు ఎక్కడ కూడా స్థలం లేకపోవడంతో రైతులు బైపాస్‌రోడ్డుపైనే ధాన్యం పోయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కలెక్టర్ స్పందించి ఏడు విలీన గ్రామాల రైతులు ధాన్యం విక్రయించేందుకు పదెకరాల స్థలాన్ని కేటాయించాలి. దీంతో భారీ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

సమస్యల వలయంలో తుర్కకాశీ కాలనీ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాలకులు మారుతున్నా ఆ బడుగు జీవుల తలరాతలు మారడం లేదు. 30 ఏళ్లుగా పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తున్న ఆ కుటుంబాలకు 'గూడు' కల నెరవేరడం లేదు. కనీస వసతులు లేక దుర్భర జీవితాన్ని సాగిస్తున్నారు ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామపంచాయతీ పరిధిలోని తుర్కకాశీ కాలనీవాసులు. ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు తమ దరికి చేరడం లేదని వాపోతున్నారు.

- గుడిసెల్లో కాలం వెళ్లదీత

మండలంలోని దుమాల గ్రామ పంచాయతీ పరిధిలోని తుర్కకాశీ కాలనీలో మొత్తం 22 కుటుంబాలు జీవిస్తున్నాయి. సుమారు 150 మంది జనాభా ఉండగా 75 ఓటర్లున్నారు. బండరాళ్ల కొడుతూ కుటుంబాలను పోషిస్తున్నారు. పూరి గుడిసెల్లో తలదాచుకుంటున్నారు. వానాకాలంలో చిరుజల్లులకే గుడిసెలు ఉరుస్తుండడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలం వస్తుందంటే చాలు ఆ కుటుంబాల్లో భయం వెంటాడుతోంది. మూడు దశాబ్దాలుగా గుడిసెల్లో కాలం వెళ్లదీస్తున్న ప్రభుత్వం తమకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించడం లేదని వాపోతున్నారు.

- సమస్యలతో సతమతం

తుర్కకాశీకాలనీలో కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డు ఉన్నా మురుగు నీటి కాల్వలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో గుడిసెల చుట్టు అపరిశుభ్రం నెలకొంది. దుర్గంధం నడుమ కాలం వెళ్లాదీస్తున్నారు. చుట్టు పిచ్చి మొక్కలు, మురుగు నీరు చేరడం వల్ల విష పురుగులు, పాముల సంచారం అధికమైందని వాపోతున్నారు. చీకటి పూట బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నామని ఆవేదన చెందుతున్నారు. మురుగు నీరు మధ్యలో నిలబడి తాగు నీరు పట్టుకోవాల్సిన దుస్థితి దాపురిస్తోందని పేర్కొంటున్నారు. బోరు నీరే దిక్కవుతోందని వాపోతున్నారు. ఈగలు, దోమలు వృద్ధి చెందడం, బోరు నీరు తాగడం వల్ల జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా తమకు కాలనీలో సమస్యలను పరిష్కరించడంతో పాటు ఇళ్లు కేటాయించి ఆదుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.


నీటిని పట్టుకుంటున్న మహిళలు

బోరు నీరే దిక్కు

చోటీబీ, కాలనీవాసి



మా కాలనీలో డ్రైనేజీలు లేక మురుగు నీరు గుడిసెల వద్ద చేరుతోంది. కంపు వాసనలో కాలం వెళ్లదీస్తున్నాం. మిషన్ భగీరథ నీరు ఎప్పుడొస్తయో తెలియని పరిస్థితి. వారానికో సారి వస్తే డ్రమ్ములు, చిన్న పాత్రల్లో నింపుకుంటున్నాం. తాగేందుకు కాలనీలో ఉన్న బోరు నీరే దిక్కవుతోంది. సార్లు పట్టించుకుని సమస్యలను పరిష్కరించాలే.

సమస్యల పరిష్కారానికి చర్యలు

మహేందర్, పంచాయతీ కార్యదర్శి



గ్రామంలోని తుర్కకాశీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతాం. కాలనీలో మురుగు నీటి కాల్వ నిర్మాణాన్ని ప్రధాన రహదారి వద్ద నుంచి చేపట్టాం. గుడిసెల నుంచి వచ్చే వృధా నీరు పోయేందుకు కాలనీవాసులు ప్రధాన మురుగు కాల్వల్లోకి వెళ్లేలా పైపులు వేసుకోకపోవడం వల్ల అక్కడే నీరు నిల్వ ఉంటుంది. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి గుడిసె గుడిసెలకు మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

మూలనపడ్డ చెత్తసేకరణ ఆటో రిక్షాలు

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు


చిన్నబోనాల వార్డు కార్యాలయంలో మూలనపడ్డ చెత్తను సేకరించే ఆటోరిక్షా

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చెత్తసేకరణ కోసం లక్షల రూపాయలను పెట్టి కొనుగోలు చేసిన చెత్తసేకరించే ఆటోరిక్షాలు చెడిపోయినా అవి మరమ్మతులకు నోచుకోవడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటు కాకముందు ఉన్న సిరిసిల్ల మండలంలో ఉన్న గ్రామాల్లో చెత్తను సేకరించేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కరెంట్‌తో నడిచే ఆటో రిక్షాలను ప్రతీ గ్రామపంచాయితీల నుంచి నిధులను సేకరించి అధికారులు కొనుగోలు చేసి అందించారు. అయితే సిరిసిల్ల మండలాన్ని విడదీసి అందులో ఉన్న ఏడు గ్రామా లను అర్బన్ మండలంగా ఏర్పాటు చేశారు. అనంతరం సిరిసిల్ల మున్సిపాల్టీలో విలీనం చేశారు. దీంతో గ్రామపంచాయతీలుగా ఉన్న రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్ధాపూర్ గ్రామాలు మున్సిపల్ వార్డులుగా మారిపోయాయి. గ్రామపంచాయతీలుగా ఉన్న సమయం లో లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన చెత్తను సేకరించే ఆటో రిక్షాలు చెడిపోయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. వాటిని వార్డు కార్యాలయాల్లోనే మూలన పడేయడంతో రిక్షాలు వర్షాలకు తడుస్తూ, ఎండకు ఎండుతు తుప్పు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. చెడిపోయిన చెత్త రిక్షాలను బాగు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌తోపాటు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి స్పందన లేకుండా పోయిందని తెలిపారు. ఇప్పటికైనా లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన చెత్తరిక్షాలను కలెక్టర్ పరిశీలించి వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి

- నర్మెట ప్రభుదాస్, చంద్రంపేట



చెత్తను సేకరించేందుకు లక్షలాది రూపాయలను వెచ్చించి కొనుగోలు చేసిన ఆటో రిక్షాలు చెడిపోయి మూలనపడి ఉన్నాయి. వాటిని మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేయించకపోవడంతో అవి తుప్పు పట్టి పనికి రాకుండాపోతున్నాయి. కలెక్టర్ స్పందించి విలీన గ్రామాల్లో మూలన పడ్డా చెత్తసేకరించే రిక్షాలు, సైకిళ్లను పరిశీలించి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకరావాలి.

ప్రయాణ ప్రాంగణం.. గుంతలమయం

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


బస్టాండులోని గుంతలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం గుంతలమయంగా మారింది. ఆర్టీసీ బస్సులు గుంతలోంచి వెళ్లాల్సి వస్తోంది. ప్రయాణికులు గుంతల వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ప్రాంగణంలో సీసీ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించకపోవడం వల్ల ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు నిలుస్తోంది. తొందర పాటున బస్సు కోసం పరుగులు తీసే ప్రయాణికులు అందులో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు నారాయణపూర్, సింగారం, బండలింగంపల్లి, దుమాల, అక్కపల్లి, బుగ్గరాజేశ్వరతండా, తదితర గ్రామాల ప్రజలు సిరిసిల్ల, కామారెడ్డి, కరీంనగర్, హైదరాబాద్ తదితర పట్టణాలకు వెళ్లాలంటే మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం వందల మంది ఆర్టీసీ బస్సుల కోసం ప్రాంగణానికి చేరుకుంటారు. గుంతలమయంగా మారడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రయాణ ప్రాంగణంలోని గుంతలను పూడ్చి ఇబ్బందులను తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని మల్లన్న స్వామి బోనాల పండగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆదివారం ఉద యం నుంచి స్వామి వారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని భ క్తులు భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేశా రు. బోనంను నెత్తిన ఎత్తుకొని డప్పు చప్పుళ్ల మధ్య పోతురాజుల విన్యాసాలతో భక్తులు శోభాయాత్రగా ఆలయానికి బయలుదేరారు. ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి బోనాలను స్వామివారికి సమర్పించుకోని మొక్కులు చెల్లించుకున్నారు. నాయకులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

మల్లాపూర్ : సట్టి వేడుకల్లో భాగంగా పలువురు భక్తులు ఆదివారం మల్లన్న స్వామికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని పునరావస గ్రామమైన రత్నాపూర్ గ్రామ శివారులోని గుట్టపై గల మల్లిఖార్జున ఆలయంలో ఆ దివారం భక్తులు ప్రత్యేక పూజలు జరిపిం చారు. ప్రతి ఇంటింటి నుంచి భక్తులు బోనంతో ఆలయానికి వెళ్లి ప్రదక్షణలు చేసి స్వామి వారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రత్నాపూర్ ప్రజలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మార్కండేయ పురాణ ప్రవచనాలు

కోరుట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంని పద్మశాలి ఆఫీషయల్స్, ప్రొఫేష నల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు మార్కండేయ పురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞం నిర్వహన కు పోపా సభ్యులు ఏర్పాట్లను చేస్తున్నా రు. పట్టణంలోని పద్మశాలి సంఘ భవ నంలో పౌరాణికప్రవర, ప్రవచన చక్రవర్తి శ్రీ శృంగేరీ శారదాపీఠ ఆస్థాన పౌరాణి కులు బహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మచే శ్రీ మార్కండేయ పురాణ ప్రవచన జ్ఞానయజ్ఞం నిర్వహిస్తున్నారు. సాయం త్రం 6 గంటల నుంచి 7:30 వనరే పురాణ ప్రవచనాలు జరుగుటకు ఏర్పాట్లను చే స్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం 5:30 నుంచి 6 గంటల వరకు మహిళలచే శ్రీ లలితా సహస్రనామ పారయణం నిర్వ హించనున్నారు. 15వ తేదీన ఉదయం శివ పార్వతులుల కల్యాణం మధ్యాహ్నం అన్న ప్రసాద వితరన కార్యక్రమాలు ఉం టాయని పోపా సభ్యులు తెలిపారు.

విద్యార్థులు భయం వీడాలి

రాయికల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భయం వీడాలని ప్రముఖ సైకాలజిస్టు గంప నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణం లోని ప్రగతి ఉన్నత పాఠశాలలో విజయతారా అనే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సైకాల జిస్ట్, ఉత్తమ కమ్యూనికేషన్ అవార్డు గ్రహీత నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీ, చాటింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. సమయాన్ని వృధా చేయకుండా ఏరోజు పనులు అదే రోజు చేసుకునే విధంగా క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పా ఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ బాలె జయశ్రీ శేఖర్, అకాడమిక్ డైరె క్టర్ నిఖిల్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.